# ★ అచ్ఛపు చీకటిల్లో ★

రచన:

"మంజుశ్రీ"

ఇది కథ అనుకుంటే దీన్ని చాలా రకాలుగా మొదలెట్టవచ్చు. కథ కాదనుకుంటే యిబ్బంది లేదు. ఇది కథే అనుక రాయపోతే ఏదీ కాదు. ఏదో వాటి కాక పోతుందా- కాబట్టి కథేను అని చెప్పాలని కాదు నా ఉద్దేశం.

మా తాత చిన్నప్పుడు అదే పనిగా రాత్రిళ్లు ముఖ్యంగానూ, పగలు కూడా యెప్పుడైనానూ భాగవతంలో పద్యాలు చదువుతుంటూ వుండేవాడు. ఆ రోజుల్లో ఆయనగారి ఆనందం యేమిటో అలా రోజూ ఆ చదివిన పద్యాలే అలా చదవటంలో నాకు అర్థమయ్యేది కాదు; కాని అది ఆనందం కాదని, దుఃఖ భావననుండి విముక్తి కోసరంగా పడుతున్న శ్రమ అనీ కొద్దిగా పెద్దవాణ్ణైన తరువాత గ్రహించాను. 'అచ్చపు జీకటింబడి. . . .' అన్న పద్యం వినీ వినీ నాకు ఇవాళకూడా అలానే గుర్తుండిపోయింది. ఇది వొక రకమైన మొదలు.

మరి— ! స్టేషన్లో సుందరి కన్పించింది ఈ సుందరి యెవరని మీరు అడగవద్దు. అలా అడిగినా నేను చెప్పను. అసలు సుందరి పేరు పుట్టి సుందరి కాదు. ఇంక నాలుగక్షరాలు కూడా కలిస్తే కాని సుందరి కాదు. కాని ఆ నాలుగక్షరాలూ నేను చెప్పను. ఒకవేళ సుందరి దీన్ని చదువుకుంటే అమాంతం గర్వపడిపోవచ్చు. ఒకరు నా కోసం ఇంతగా తపించి పోతున్నాడు కదా, ఇంతగా జీవితంలో అరుచి తెచ్చుకున్నాడు కదా, అని.

మనను గురించి యెవరో హృదయంలో ఆకాశమంత వెలితి భావిస్తున్నారనీ, చిమ్మ చీకటిలో నట్టనడి సముద్రంలో మునిగి పోతున్నప్పుడు అనుభవించేంత నిర్వేదాన్ని మనను తలుచుకుని ఇంకోరు పొందుతున్నారని, తెలిస్తే, అవతలి వ్యక్తిపైన నిజమైన జాలీ సానుభూతీ కలిగి వుండకపోవచ్చు. వొక రకమైన ఆనందం లేకపోలేదు. ఎక్కడో చీకటి రాత్రిళ్లలో మనను ప్రేమించే వాళ్లు వున్నారనీ, మనను తలుచుకుని అంత బాధ పడేవాళ్లు వున్నారనీ, తెలిసినప్పుడు వొక తృప్తి. అది వొక రకమైన అంతః కరణ ప్రవృత్తి. సుందరి కూడా అలానే భావించవచ్చును కదా! మరి అయినా సుందరి నన్ను గుర్తించనట్లుగా ముందుకు సాగింది. తనూ, ఇద్దరు పిల్లలూ, తన పిల్లల తండ్రీ, సినిమాకు వెళుతున్నారులా వుంది. స్టేషన్ అంటే రైలుబండి దిగారని కాదు. సికింద్రాబాద్ స్టేషన్లో స్టేషన్ కెదురుగా బస్సులు నిలుస్తాయి. అక్కడ నాకు కనపడింది. నేను యెంత ఆప్యాయంగా, అభిమానంగా సుందరివేపు చూశానో, నా వేపు మిడుకు మిడుకూ ముభావంగా చూసింది. ముందు కదిలిపోయింది. మరి, పిల్లలూ, వాళ్ల తండ్రీ వున్నారాయె. లేకపోతే, అక్కడే చెవిలో రహస్యం చెప్పుకున్నట్లుగా పలకరించుకునే వాళ్లం కాదూ. 'ఎన్నాళ్లకు కనపడ్డావు నా ప్రాణమా' అని.

ఇదికూడా ఇంకో రకమైన ప్రారంభం. ఇకపోతే, ప్రతి మనిషి జీవితంలో కొన్ని పెళ్ళిళ్లూ, కొన్ని చావులూ విధిగా చూడవలసి వుంటుందని నాది వొక సిద్ధాంతం వుంది. ఈ రెండూ తప్ప జీవితంలో చెప్పుకోదగ్గ సంఘటనలు యేవీ వుండవని తాత్పర్యం. అర్థంకూడా. ఒకానొక పెళ్ళిలో కాబోలు, ఆ పిల్ల నాకు చుట్టాలమ్మాయి దగ్గరది.

మరి - బృందావనంలో గోపికలు కృష్ణుణ్ణి అలా చూసి వుంటారు. కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని అలా చూసినట్లు గుర్తు. మనిషిలో స్వార్థమూ, అహంకారమూ, దర్పమూ, యెక్కువ పాళ్లలోనే వుంటాయని నాకు తరువాత తెలిసింది. తరువాత దాని పెళ్ళికి నేను పోలేదు. ఎప్పుడేనా ఇప్పుడది కావాలనిపిస్తుంటుంది నాకు. ఇది కూడా వొక రకమైన మొదలే యీ కథకు ఇక.

లక్ష్మి అంటుంది. ఈ ప్రపంచంలో సుఖపడుతున్న వాళ్లు యెవరూ లేరని, అందరూ నటిస్తున్నారని. నాకు కోపం రాకపోయినా, లక్ష్మి చెప్పింది నాకు నచ్చదు. నేను చిన్నతనం నుంచీ యిన్ని పుస్తకాలు చదివాను. అందులోని పాత్రలు లాగా జీవిద్దామని అనుకున్నాను. మనుషులంతా ఇలా దొంగ బ్రతుకులు బ్రతకటం నాకు బొత్తిగా ఇష్టంలేదు. నేను బాగా చిన్నతనంలో వుండగా చెరువు కట్టపైని పార్కులో సంజె చీకటి పడుతుండగా వొడ్డున కూచుని నీళ్లలో పాదాలు తడుపుకుంటూ, వొక మగవాడూ వొక ఆడామె కూచుని కబుర్లు చెప్పుకుంటూ అలవోకగా నవ్వుకునేవారు. వాళ్లకో పాపాయి వున్నాడు. వాడు మధ్య మధ్య యీమె వొళ్ళో నుంచి అతని వొళ్ళోకి, అతని వొళ్ళో నుంచి యీమె వొళ్ళోకీ వస్తూ పోతూ వుండేవాడు. వాళ్లను చూస్తే అంత చిన్నతనంలోనే నాకు ముచ్చటగా వుండేది. ఆ విషయం ఇప్పుడు లక్ష్మికి చెపితే అంటుందేమో. అన్నీ వొట్టిది. అప్పుడు నువు చిన్నవాడివని చెప్పావు కదా. అందుకే నీకు తెలిసుండదు." అతడు వారం రోజులకోసారి ఇంటికి వస్తుండేవాడు. ఆమె ఉద్యోగం చేస్తూ వుండేది, కదూ." అంటుంది లక్ష్మి.

నే నంటాను. "లక్ష్మి జీవితంలో నీకు చాలా అన్యాయం జరిగింది, ఇందుకు

కార్య కారణాలు నేను చెప్పలేను. అందుకని ప్రపంచంలో నిజమైన ప్రేమ, నిజమైన అభిమానమూ, నిజమైన జీవితం, వుంటాయని నీవు నమ్మవు. నిన్ను నువు నమ్మించుకో లేవు"

లక్ష్మి అంటుంది. "నువు చాలా చిన్న పిల్లవాడివమ్మా! నీకు తెలీదు. ఎప్పటికో తెలియకపోతుందా. నిజమైన ప్రేమ, ప్రపంచంలో వుండదని నేననను. ఉదాహరణకు నేను నిజంగా నిన్ను ప్రేమిస్తున్నాననుకో, ఏం లాభం! కృత యుగంలో దేవయాని ప్రేమ కథా నీకు తెలీయదూ. అప్పటి నుంచీ ఇంతే."
"లక్ష్మి, నువు అందమైన దానివి, మంచి దానివి, ఏమిటి నీకీ అసంతృప్తి. ఎందుకు నీకు దుఃఖం?" అని నేను అడిగితే యేం చెపుతుంది. ఎక్కదలచుకున్న రైలు కథ చెపుతుంది. అదిట. మనం స్టేషన్లో యెంతసేపు కాచుకుని వున్నా రాదు. అథవా వచ్చినా మనముందే వెళ్ళిపోతుంది. ఎందుకు యెక్కలేమో మరి!

నేనంటాను. "నాకు చెప్పు. నిజంగా చెప్పు. మనం యే రైలు యెక్కినా, ఇలాగే అనుకుంటామేమో!"

లక్ష్మి అంటుంది. "అది యేమీ కాదు ఇది సృష్టియొక్క లక్షణం. అయితే కొంతమంది మనుషులకు బాధా తెలీయదూ ఆనందమూ తెలీదు. వాళ్లు హాయిగానే వుంటారేమో! ఓడిపోయి రాజీ పడటం కష్టం కదమ్మా. ఏం లేకపోయినా బ్రతుకవచ్చు. కాని మనం పొందింది యేదో, అది మనకు అస్సలు ఇష్టంలేనిదైతే కష్టం." లక్ష్మి నిన్ను నేను ప్రేమించానా! ఎక్కడో సన్నాయి వినవస్తోంది. ఎక్కదలచుకున్న రైలు ఎప్పుడో వెళ్ళిపోయింది.

ఇది ఇంకో రకమైన మొదలు.

ఇన్ని రకాలుగా యీ కథ మొదలెట్ట గలిగి నప్పటికీ, దీనికి ముగింపు మాత్రం ఇన్ని రకాలుగా వుండదు, ఒకే వొక్క విధంగా వుంటుంది.

తాతయ్య చచ్చిపోయాడు. మరి యీ చీకట్లోంచి వెలుగు కనపడిందో లేదో! ఎవరికీ తెలీదు కదా! సుందరికి మూడో సారి కూడా మగపిల్లవాడే పుట్టినట్లు అప్పుడెప్పుడో నాకు వోసారి కలవచ్చింది.

మూడో రకంగా చెప్పడానికి మొదలెట్టిన కథలోని పాత్ర యొక్క భర్త నాకంటే బావుండ కూడదని నా కప్పుడప్పుడు అనిపిస్తూ వుంటుంది. ఎందుకంటే- ఏం చెప్పను. ఏమిటో మరి.

లక్ష్మి యివాళ కూడా యెప్పుడేనా కనపడతూ వుంటుంది. అంటుందీ, నవ్వటం అలవాటైందిట.

నా కనిపిస్తుంటుంది యిళ్ళూ వాకిళ్లూ యీ మనుషులూ, యీ ప్రేమలూ, యివన్నీ యేమిటని. ఆలయానికి పోతాము, మసీదుకు పోతాము, చర్చికి పోతాము! ఎందుకు? ఏదో భయం. ఏదో అసంతృప్తి అది పోగొట్టుకునేందుకు ఏదో ఆశ. అది ఫలించేందుకు యిక్కడ యేముంది? ఈ కార్లూ, బంగాళాలు యివన్నీ యెందుకు. మనుషులకు యేం కావాలి. ఒక్కొక్కరికి యింత అతిశయం దేనికి. పందేళ్ల పెద్దకల తరవాత యెప్పుడో మెరుపు రాదా, ఉద్యోగం చేస్తుంటే ఆఫీసర్ మనముందు గర్వం వెళ్లబోస్తాడు. డబ్బున్నవాడికి అతిశయం. మనుషులకి తోటి మనుషులని చూస్తే నిర్లక్ష్యం. దుఃఖమన్నది తుదీ మొదలు లేకుండా ప్రపంచాన్ని ఆక్రమించుకుని వుంది. దుఃఖాభాసమే సుఖమని అప్పుడప్పుడు అనుకుంటూ వుంటాము.

యిదంతా యేమిటి.

నచికేతు డడిగిన ప్రశ్న.

చీకటి.

భయం.

కామం.

అందానికి నిర్వచనం యేమిటి?

ఎవరు యెవరికి యేమవుతారు?

తనకు నిజంగా కావలసింది యేమిటో యెవరైనా యెక్కడైనా చెప్పగలరా. మంచి మనిషి అంటే యెటువంటివాడు.

ఆత్మ యెలా వుంటుందో. మనిషిలో ఆలోచించేది యెవరో!" రామే జననీ, కో మే తాతః" "whichis only living can only die..." "అవిదిత గత యామా..." వెన్నెల. మగవాడూ ఆడదీ ముద్దు పెట్టుకుంటూరు.

"మాంగల్యం తంతునానేనా మమ జీవన హేతునా...." "నాలి చరామి... మనుష్యులు యేంతప్పు లేకుండానే శిక్షింపబడతారు. పెళ్ళాన్ని మొగుడు పుట్టి పుణ్యానికి యేడిపిస్తాడు. దేవ గన్నేరు పూలు బావుంటాయి. చిన్న పిల్లల చిరునవ్వుని వెన్నెలతో పోలుస్తారు. వాళ్ళే పెద్దవాళ్ళై కోరలూ, గోళ్లు పెంచుకుంటారు. మనస్సులని గాయపరచటానికి, చీల్చటానికి. "chil is the father of the Man" "సర్వం త్యక్త్వా స్వప్న విచారః" ముసలివాళ్లు. ఎప్పుడో రాత్రిలోకపు తలుపులు తెలుస్తారుట. ఏకాకినం, పరవశం, చకితం మాం, దయాళో" మమదేహి కరావలంబం" ప్రేమించాలనుకున్న వాళ్లకు అవతల వాళ్లు అందంగా కనపడతారు కదూ. చీకటిలో చిన్న దీపం వెలిగించినట్లు, ఎప్పుడేనా వోక మంచి మనిషి మంచి ఆలోచన చెపుతాడు చాలా మందికి జీవితం "అంధేందూ దయముల్"

సరే.. ఇదీ వరస.

ప్రేమల నోముల పాల బుగ్గలూ....

తండ్రి సందిటా, తల్లి కౌగిటా.... నా వసనే జన్మించెనే మోహాముల్ ముగ్గుబుట్ట వంటితలా, ముడుతలుబారిన దేహం

వాసాంసి జీర్ణాని నయా విధాని....

ఇంతే ...

ఈ కథకు ముగింపు....

నా చుట్టూ మనుషులు, నేను బ్రతుకు తున్నాను.

—o—